అగ్నిపర్వతం భుగభుగలు

ఆకాశంమీద జేగురురంగు ఇంకా మాసిపోలేదు. ప్రభాకరం నున్నగా తల దువ్వుకొన్నాడు. బళ్లోకొచ్చాడు. పిల్లలెవళ్ళూ రాలేదు—రామ్మూర్తి సుబ్రహ్మణ్యం తప్ప.

కావమ్మ తలుపులు తీసింది. చీపురుతో గదులన్నీ శుభ్రంగా తుడుస్తోంది. దుమ్ము రేగుతోంది గదుల్లో. చీపురు చప్పుళ్ళుతప్ప అంతా నిశ్శబ్దం.

బడిఅరుగుమీద కూర్చున్నాడు ప్రభాకరం. నేలమీద, గోడలమీద సున్నం బెల్లులు బెల్లులుగా ఊడిపోయింది. గోతులుపడ్డాయి. గోతుల్లో చేతులు పెట్టి కెలుకుతూ, సున్నం రాళ్ళు ఏరుతున్నాడు. రాళ్ళనివేళ్ళతో గోళీకాయల్లా విసురుతున్నాడు ప్రభాకరం.

రామ్మూర్తి సుబ్రహ్మణ్యంతో రెండో అరుగుమీద కూర్చున్నాడు. పలకపుల్లలూ అవీ పడేసుకునే సీనా రేకు హారతి కర్పూరం పెట్టెలోంచి సాతాళించిన సెనగలు తీసాడు. సుబ్రహ్మణ్యానికి కొంచెం పెట్టాడు. ఇద్దరూ ఒడేసి నవుల్తూ తింటున్నారు.

రఘురామయ్య మేస్టారు గబగబావచ్చారు. కంగారు పడుతున్నాడు. బడిలో ప్రవేశించారు. "కావమ్మా" అని కేక వేశారు. "హెడ్‌మాస్టారు రాలేదూ?" అని అడిగారు.

దించినబుర్ర ఎత్తకుండా ఒంగుని తుడుస్తూనే ఉంది కావమ్మ. "లేదండి బాబూ" అంది.

ఏదో తపన పడుతున్నాడు రఘురామయ్యగారు. కుర్చీలో కూలబడ్డాడు. డెస్కు తలుపు తెరిచి ఏదో సవరించాడు. కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. "ఒరేయ్—కుర్రవెధవల్లారా—యిలారండి" అని బిగ్గరగా కేక వేశాడు.

రఘు రామయ్యగారి గొంతు కుర్రాళ్ళందరికీ తెలుసు. ఆయన దగ్గర చదువుకొనేవాళ్ళయినా, కాకపోయినా పిల్లకాయలంతా ఆయన వూసెత్తే సరికి భయపడిపోతారు. అయితే రఘు రామయ్య గారెవర్నీ కొట్టినట్టు మాత్రం గుర్తు లేదు.

పరిగెత్తుకుంటూ వచ్చేశారు కుర్రాళ్ళు. రామ్మూర్తీ, సుబ్రహ్మణ్యం నవుల్తూన్న సెనగలు మింగేశారు.

ప్రభాకరం రాళ్ళు పారేసి చేతులు దులుపు కున్నాడు. బిక్క మొహం వేసుకుని మేష్టారిదగ్గరకు వెళ్ళాడు.

"ఒరేయి తెల్లవారుఝామున ఏంజరిగిందో తెలుసా?"

పిల్లలెవళ్లూ మాట్లాడలేదు. ప్రభాకరం బిక్కమొహం ఎత్తి అన్నాడు: "ఏం జరిగిందండి?"

"రంగయ్య మేష్టార్ని వాళ్ళు తీసుకుపోయార్రా!" రఘురామయ్యగారు జాలిగా మొహంపెట్టాడు. కళ్ళల్లో నీళ్ళు గిరగిరా తిరిగాయి. పిల్లలు చూడకుండా తుడిచేసుకున్నాడు.

పిల్లలు కొయ్యయి పోయారు. ఒక్కళ్ళూ మారు మాట్లాడటంలేదు. 'తీసికెళ్ళినవాళ్లు ఎవళ్లూ?' అనిపిల్లలడగ లేదు. రఘురామయ్యగారు చెప్పనూలేదు. ప్రభాకరం గుండెలు కొట్టుకొంటున్నాయి. బిక్క చచ్చిపోయాడు. తాచుపాములు పీకకు చుట్టకొని నులివెడుతూ బిగిస్తున్నట్టుంది అతని పరిస్థితి.

ప్రభాకరం నాలుగవ తరగతి చదువుతున్నాడు. వాళ్ల క్లాసుకు మేష్టారు రంగయ్యగారు. అంతే!—అంతకన్నా దగ్గర చుట్టరికమేమీలేదు. ప్రభాకరం దిగాలుపడిపోడానికీ, బెంగతో కృంగిపోడానికీ అంతకన్నా వేరే కారణమూలేదు.

"రంగయ్యమేష్టార్ని వాళ్లు తీసుకుపోయారట..."

లేతదానిమ్మ మొగ్గలాంటి పెదవులు వొణికిపొయ్యాయి. గొంతు ముడి తెంచుకుని దుఃఖం వరదలా పొంగింది. వెక్కి

వెక్కి ఏడ్చాడు. బడి తోటలో ఒంటరిగా తిరిగాడు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో ఊహించుకోలేదు ప్రభాకరం.

ప్రభాకరం నున్నని క్రాపుక్రింద చెమటలు క్రమ్మాయి. శిరంగులు బ్రద్దలయ్యాయి; తుపాకులు భయంకరంగా గర్జించాయి. లారీలు పంజాలెత్తుకుని బరబరా పరిగెత్తాయి.

"రంగయ్యగారిని వాళ్ళు తీసుకుపోయారు..." రంగయ్యగారు తమకి మేష్టారు; తనకి ఎన్నోసార్లు సుద్దముక్కలిచ్చారు. ప్రభాకరం, పురివిప్పుకున్న నెమలి బొమ్మను క్లాసు పిల్లలందరికన్నా బాగావేశాడని రంగయ్యగారేదో పుస్తకం బహుమతీచేశారు; ఆ పుస్తకాన్ని తానింకా చదవనైనా లేదు.

"రంగయ్య మేష్టార్ని వాళ్ళెందుకు తీసుకుపోయారు?" గట్టిగా అరిచాడు ప్రభాకరం. కడుపులోని ఏడుపు మాత్రం పగిలిన కడవలోని నీరులా ఉబ్బెత్తుగా పైకొచ్చింది. ప్రభాకరం మెదడులో అగ్నిపర్వతాలు భుగభుగమన్నాయి.

సూర్యుడుమెల్లమెల్లగా కొండఎక్కుతున్నాడు. చల్లని ఉదయపు గాలులు తొగరచెట్టు ఆకుల్లో సంగీతాలు నేర్చుకుంటున్నాయి. సీమ చింతకొమ్మమీద పాలపిట్ట కూర్చొని ఎందుకో ఏడుస్తోంది.

ప్రభాకరం చాలాసేపాలోచించాడు: 'రంగయ్యమేష్టార్ని వాళ్ళు తీసుకుపోడానికి కారణమేమిటా" అని. కాని-ఏమీ తోచిందికాదు. బడిచుట్టూ ఎన్నోసార్లు తిరిగాడు.

"రంగయ్య మేస్టార్ని ఎందుకు తీసుకుపోయారు?" చుట్టూవున్న చెట్లనీ, పూలమొక్కల్నీ చాలామార్లు అడిగాడీ ప్రశ్న. పూలమొక్కలు జాలిగా తెలియదని చెప్పాయి.

క్రమంగా అబ్బాయిలంతా బళ్ళోకి వచ్చేశారు. పిల్లల కీచుగొంతులతో గొణగొణలాడుతోందిబడి. అందరూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు. సుబ్రహ్మణ్యం స్తంభంపట్టుకొని గిరగిరా తిరుగుతున్నాడు. రామ్మూర్తి గులకరాళ్ళేరుకుంటు న్నాడు. మిగతా పిల్లలంతా ఏవో గొడవలు చెప్పుకుం టున్నారు.

ప్రభాకరం ఏ గొడవా వినటం లేదు. ఏదీ వినాలని ఏదీ మాట్లాడాలని లేదు. కాస్సేపు ఒంటరిగా ఒకచోట నించుం టాడు. మళ్ళీ నడుస్తాడు. పిచ్చొడులాగ తచ్చాడుతున్నాడు ప్రభాకరం.

హెడ్ మాష్టారు వచ్చారు. ధుమధుమలాడుతూ ధూమ్రనూత్నుడులా వచ్చారు. వస్తూనే ఆయన గది తలుపు తాళంతీసి భళ్ళున తోసారు. డ్రాయరు తాళంతీసి ఏవో కాగితాలు తీసుకుంటున్నారు. హెడ్ మాస్టారు అలాకోపంగా ఉండటానికంత చెప్పుకోదగ్గ ప్రత్యేక కారణం లేకపోవచ్చు. ఆయన స్వభావమే అంతో, లేక అలా ఉండాలని ఉంటాడో తెలుసుకోవడం సాధ్యంకాదు.

హెడ్ మాస్టారు రావడం చూశారు రఘురామయ్య మేస్టారు. మెల్లగా హెడ్ మాస్టారి గదిలోకి వెళ్ళారు. ఇదంతా గమనిస్తున్న ప్రభాకరం కిటికీదగ్గరకు వెళ్ళి నించునిచూస్తున్నాడు.

రఘురామయ్య మేస్టారు మందస్వరంతో ఇలా అడిగాడు: "ఈవేళ మన బడికి సెలవిస్తే బావుంటుందండీ—అన్యాయంగా రంగయ్య మేస్టార్ని వాళ్ళు తీసుకుపోయారుగదా. విచారసూచకంగా ఈవేళ సెలవిద్దాం!" అని.

రఘురామయ్య మాట్లాడుతున్నంతసేపూ ఏమీ మాట్లాడలేదు హెడ్ మాస్టారు. ముక్కుమీదికి ఉన్న కళ్ళజోడులోంచి క్రోలగా చూస్తున్నాడు. రఘురామయ్య చెప్పడమయిపోయిన వెంటనే ఓటికుండలా భళ్ళున బద్దలయ్యాడు: "ఊఁహూ, అలాగా; సెలవివ్వాలంటారా; చిత్రం: అన్యాయంగా రంగయ్యని తీసికెళ్ళారంటారూ..." అంటూ సాగదీసుకుని, ఒక్కమారిలా కసిరాడు: "చాల్చాలు—ఇలాంటి పిచ్చి కబుర్లెప్పుడూ చెప్పకు: వెళ్ళు నీపనిచూసుకో"

కాని రఘురామయ్య కదలలేదు.

హెడ్ మాస్టారు మళ్ళీ అందుకున్నాడు; "రంగయ్య—వలె ఏమీ తెలియని నంగనాచే అంటావూ?—తానున్నది జిల్లాబోర్డు ఉద్యోగంలో—తన కెందుకూఅంట, అక్కర్లేని గొడవలు! ఊరికి పెద్దవాళ్ళయిన కర్ణం మునసబులతోటే, కనకయ్య

శ్రేష్ఠిగారితో పోటీ విరోధమా? వాళ్ళకి వ్యతిరేకంగా పేటవాళ్లని కూడగట్టుతూ ఉంటే, ఏం చేయడం లేదులే అని ఊరుకుంటారా? పైగా మనం సెలవియ్యాలంటావ్—అంతా ఏమనుకుంటారూ? అన్నాడు దబదబా.

ఏమనుకుంటారో రఘురామయ్యకి అర్థం కాలేదు—ఏమనుకుంటే ఏం నష్టం? అనుకున్నాడు—ఏమీ మాట్లాడలేక చాలాసేపు తటపటాయించాడు-గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ ఇలా అన్నాడు. "నేనీవేళ పాఠాలు చెప్పలేను, నాకు సెలవివ్వండి" అని—

"అలాగ్గాండి...పాఠాలు చెప్పలేక పోవడమేమో! ఇదిగో, ఎందుకు చెబుతున్నానో విను రఘురామయ్యా! అనవసరంగా లావాదేవీలు తెచ్చుకోవడం నాకిష్టం లేదు—అధికార్లతో పని, ఏమనుకున్నావో, మన ఉద్యోగధర్మానికి చాలాముప్పు—"అన్నాడు హుందాగా.

కాని రఘురామయ్యగారేమీ సందేహించలేదు— "ఏమైనాసరే, నాకు సెలవిప్పించండి" అని మెల్లగా చెప్పి జారి పోయాడు.

హెడ్మాస్టారు మాత్రం కాలుకాలిన పిల్లిలా అటూ ఇటూ పచార్లుచేశారు—"ఎంత పొగరుమోత్తనం! చెబితే వినిపించుకోడుకదూ! సరే—" అనుకున్నాడు తనలో.

ఈ సంభాషణ యావత్తూ వింటున్న ప్రభాకరానికి హెడ్‌మాస్టార్ని చూస్తే అసహ్యం వేసింది. "ఛీఛీ ఇలాంటి వాళ్ళ మొహం చూడకూడదు" అనుకున్నాడు. "వాళ్ళు రంగయ్యమేస్టార్ని తీసుకుపోడానికి ఈయనే కారణమైఉంటాడు. ఎంత రాతిగుండో!" అనుకున్నాడు ప్రభాకరం.

రఘురామయ్య మేస్టారంటే ఎంతో ఇష్టం కలిగింది. ఆయనదగ్గరకి వెళ్ళి నమస్కరించాలనిపించింది. ఏదో మాటాడా లనిపించింది.

త్వరగా లోపలికి పరిగెత్తాడు. డెస్కుతీసి ఏదో జేబులో పెట్టుకుని వెళ్ళిపోతున్న రఘురామయ్యగారికి నమ స్కారంచేశాడు ప్రభాకరం. "నేనూ ఇంటికి వెళ్ళిపోతానండి. ఇంక మాకు పాఠాలెవరు చెబుతారు?" అన్నాడు. అన్నాడే గాని పెదవులు ఒణికిపోతున్నాయి— విచారం పొర్లుకుంటూ వచ్చేసింది.

రఘురామయ్య మేస్టారి స్థితి ఇంతకన్నా తక్కువ కాదు. ఏమీ మాట్లాడలేదు. ప్రభాకరం తలమీద చేయివేసి నిమురుతూ, క్రిందికివొంగి మృదువుగా బుగ్గలు నొక్కారు. చేయి తడిసింది ప్రభాకరం కంటినీటితో.

ఇంతలో అప్పారావు మేస్టారు రావడంచూసి రఘు రామయ్యగారు వెళ్ళిపోయాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం దూరంనుంచి చూశాడు; ప్రభాకరం వినలేదు. అప్పారావు

మేష్టారు బుర్రవూపాడు. బళ్లోకి వెళ్లిపోయాడు. రఘురామయ్య మాష్టారు వీధిలోకి వెళ్లిపోయాడు. పరిభాకరానికేం చేయాలో తోచలేదు.

బడిదగ్గరున్న తూముమీద కూర్చున్నాడు. వెర్రివెర్రి ఆలోచనలు, పాకుతున్న జెర్రుల్లా...తలపుల్లో రంగయ్య మేష్టారు. పరిభాకరం గుండెల్లో రంగయ్య మాష్టారి బొమ్మలు.

"రంగయ్య మాష్టారెంతబాగా చెప్పేవారు పాఠాలు!" నిజానికాయన రోజూ ప్రొద్దున్నో గంట మాత్రమే స్కూలు పాఠాలు చెప్పడానికి సరిపెట్టేవారు. మిగతా కాలమంతా, జాగ్రఫీ, హిష్టరీ లోకజ్ఞానం వగైరాల సందర్భంలో ప్రపంచ పరిస్థితులన్నీ చెప్పేవారు.

ఒకనాడు రంగయ్య మాష్టారు సోవియట్ రష్యాగురించి చెబుతున్నారు. అక్కడి ప్రజలంతా ఎలా అన్నతమ్ముల్లాగ బ్రతుకుతారో, కలిమి లేములభేదం ఎలా అంతరించిపోయిందో పిల్లల చదువుసంధ్యలకోసం, అందంగా ఆరోగ్యంగా పెరగడం కోసం ఆ దేశంవాళ్ళెలా శ్రద్ధతీసుకుంటారో, అక్కడి పిల్లలెలా చదువుకుంటారో, వగైరా అన్నివిషయాలు ఎంతో హాయిగా కథలాగు చెబుతున్నారు.

ఏదో పెద్ద ఇంగ్లీషు పుస్తకంతీసి ఎన్నో బొమ్మలు చూపించారు. అంతా టేబిలుచుట్టూ గుమిగూడి గల్లంతు చేస్తుంటే: "అలాకాదు, అంతా వెళ్ళిపొండి—నేనే పేరు

పేరునా పిల్చి అన్నీచూపిస్తా" అన్నారు. ఎంత శాంతం! ఎప్పుడూ కోపం వచ్చేదే కాదాయనకి. అలాగే ఇద్దరిద్దర్నీ పిలిచి అన్ని బొమ్మలూ చూపించారు.

ఆబొమ్మలు ప్రభాకరంకూడా చూశాడు. అందంగా బలంగా ఉన్న కుర్రాళ్ళు పదిమందీ కలసి ఇటికలు సున్నంవేసి చిన్న బొమ్మరిల్లు కడుతున్నారొక బొమ్మలో. ఇంకో బొమ్మలో పిల్లలాడుకునే చిన్న రైలుబండి తయారు చేస్తున్నారు. పట్టాలు ఇంజనూ అన్నీ ఉన్నాయి. డ్రైవరూ గార్డూకూడా పిల్లలే! ఎంత బావున్నాయి బొమ్మలు. ఆ కుర్రాళ్ళు సరిగ్గా తనంతే ఉన్నారు.

ప్రభాకరం ఆరోజున జరిగిన విషయాలన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటే—"ఇంకెవరు చూపిస్తారలాంటి బొమ్మలు" అని పించింది. బరువైన ప్రశ్నల్ని తేలికచేసేవి, కన్నీళ్ళు!

ఆవేళ బొమ్మలు చూపడం అయ్యింతర్వాత మనదేశం గురించీ, గాంధీజీ హత్యగురించీ, అమెరికా దేశంలోని నల్ల వాళ్ళగురించీకూడా చెప్పారు.

ఇవన్నీ చెబుతూనే ఉన్నారా—హెడ్మాస్టారు వెంటనే వచ్చారు. "ఏమయ్యోయ్—రంగయ్యా—క్లాసులో రాజ కీయాలు చెప్పకూడదని నీకెన్నిసార్లు చెప్పాలి!" అన్నాడు విసురుగా.

"ఏవి రాజకీయాల్లో, ఏవి కావో మీకు తెలియకపోవ డం వల్ల అన్నీ రాజకీయాలుగానే కనిపిస్తాయిలెండి. మరేం ఫర్వాలేదు" అని మెల్లగానే, అణకువతోనే సమాధానం చెప్పారు.

ఆ సమాధానంతో ఒళ్ళు మండిపోయింది. చేసేదేమీ లేక రుసరుసలాడుతూ వెళ్ళిపోయాడు హెడ్ మాస్టారు.

"ఏమర్రా హెడ్ మాస్టారు మీకిలాంటివి చెప్పకూడ దంటున్నారు. మానేస్తాను మరి!" అన్నారు రంగయ్యగారు.

"మానొద్దంటే వద్దని" కుర్రాళ్ళంతా రణగొల చేయడం ప్రారంభించారు.

తర్వాత ఏదో తమాషాసంగతి చెప్పారు. కుర్రాళ్ళంతా నవ్వారు.

ఆ రోజుల జ్ఞాపకాలు ప్రభాకరం గుండెల్లో మంటలు పుట్టించాయి. చాలాసేపు మూగగా, అతని ఆత్మ క్షోభించింది.

రంగయ్య మేష్టారింటికి వెళ్ళి వాళ్ళని చూడాలనిపిం చింది. ప్రభాకరం రోడ్డువెంబడి బయల్దేరాడు. దించిన బుర్ర ఎత్తకుండా నడుస్తున్నాడు.

ప్రతి అరుగుమీద ఇద్దరూ ముగ్గురూ కూర్చుని, రంగయ్య మాస్టారి గురించే మాట్లాడుకుంటున్నారు. సాగి పోతున్న ప్రభాకరం చెవుల్లో అనేక రకాల మాటలు, అప్రి యత్నంగా వచ్చిపడుతున్నాయి.

"...కాని ఎంత మంచివాడయ్యా రంగయ్యమాస్టరు. ఎంత గొప్ప రాజకీయ విషయాన్నైనా సునాయాసంగా విప్పిచెప్పేసేవాడు."

"దించిన బుర్ర ఎత్తకుండా ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూనే ఉండేవాడు!"

"అవునుగాని, ఊరుకుంటారటయ్యా, పేటల్లోకెళ్ళి కూలిజనాన్ని రెచ్చగొట్టేవాడట. కర్ణంగారు, మున్సబుగారు, కనకయ్య శ్రేష్టిగారూ ఉన్నారంటే-ముగ్గురూ రెండేసిమూడేసి వందల యకరాల భూకామందులు. అలాంటివాళ్ళకి వ్యతిరేకంగా తిప్పితే మాత్రం కూలివెధవలేం చేయగలరయ్యా... పెద్దపులులతోటా పరాశకమాడ్డం?"

"ఏమైనా రంగయ్య మాస్టారి ప్రయత్నం ఫలిస్తోంది సుమా."

"ఆఁ. ఏమిటో వల్లకాడు..."

రకరకాలమాటలు ప్రభాకరం చెవుల్లో హోరుగాలిలా వచ్చిపడుతున్నాయి. గాలిదుమ్ములా ఎగిరెగిరి పడుతున్నాయి.

వడివడిగా అడుగులువేస్తూ ప్రభాకరం రంగయ్యమాస్టారింటికి చేరుకున్నాడు. "వాళ్ళంతా ఏడుస్తూఉంటారో ఏమో!" అనుకున్నాడు.

ఇంటితలుపు లోపల వేసివుంది. "సత్యవతమ్మగారు!"

అని పిలిచాడు. ఆవిడ వచ్చి తలుపు తీసింది. విచారిస్తున్నట్లు పైకేమీ కనిపించలేదు.

"ఏం నాయనా ఇలావచ్చావ్? మీ మాస్టార్ని..." అంటూ నెమ్మదిగా, జాలిగా, సహజంగా ఏదో చెప్పబోయింది సత్యవతమ్మ.

ప్రభాకరం గొంతుముడి బడ్డలైంది. బావురుమని ఏడ్చాడు. వెక్కుతున్న ఏడ్పులో, నత్తినత్తిగా "ఇక మాకు పాఠాలూ కథలూ ఎవరు చెబుతారండీ, బొమ్మలెవరు నేర్పుతారు" అన్నాడు ప్రభాకరం. అతని ఏడుపుచూస్తే సత్యవతమ్మకి శోకమాగిందికాదు.

ప్రభాకరాన్ని దగ్గరగా చేరదీసుకుంది. "ఫరవాలేదులే నాయనా, ఏడవకు" అన్నది. పైటచెంగుతో కనుకొలుకులు నాజూకుగా తుడుచుకుంది. "వాళ్ళుమాత్రం ఎంతకాలం ఉంచుతారులే అక్కడ" అంటూ అనునయించింది.

పొద్దుటినుంచీ ఎంతమందో రైతులూ, కూలీలు ఆమెని చూడ్డానికి వచ్చారు. మిగతా మాస్టర్ల భార్యలు మొదలైన వాళ్ళు చాలామంది వచ్చారు. కాని వారందరిదీ ఒకెత్తు— ఒక్క ప్రభాకరానిది ఒకెత్తూను. ఆ పసి హృదయం ఎంత నిష్కల్మషమైన ప్రేమతో, ఎంతనిష్కామమైన అభిమానంతో తపించి పోతూందో సత్యవతమ్మ కనిపెట్టక పోలేదు.

కొంతసేపు అవీ ఇవీ కబుర్లు చెప్పింది. ప్రభాకరం దుఃఖాన్ని మానాలని ప్రయత్నించింది. అతడు కళ్ళు తుడుచుకున్నాడు. బయల్దేరడానికి లేచాడు.

'అప్పుడప్పుడు వస్తూఉండు నాయనా' అంది. దగ్గరగా తీసుకుని తల మృదువుగా నిమిరి పంపించింది సత్యవతమ్మ.

ప్రభాకరం తిన్నగా ఇంటికి వెళ్ళిపోయాడు. మడత మంచంమీద పడుకున్నాడు. పక్కనున్న బల్లమీద పలకా పుస్తకాలు పెట్టాడు. దిగులుగా బరువుగా మంచంమీద దొర్లుతున్నాడు.

"అదేంరా నాయనా, బడిలేదా వచ్చేశావ్!" అంది తల్లి దగ్గరకొస్తూ. ఆమెకి వీధిగొడవలేం తెలుస్తాయి గనుక!

చాలా సేపటికిగాని సమాధానం చెప్పలేదు. "నాకు పుస్తకాలు అవీ బహుమానమిచ్చిన రంగయ్య మాస్టార్ని వాళ్ళు తీసుకుపోయారులే!" అన్నాడు.

"ఆఁ..." అందామె. నిలువునా నీరైపోయింది.

ఆ అమాయిక మాతృమూర్తి కూడా రంగయ్య మాస్టర్ని తీసుకుపోయిందెవరో తర్కించలేదు. ప్రభాకరం చెప్పనూలేదు.

రెండు ఝాములైంది.

రోజూ అలాంటి సమయానికిముందే తల్లి దగ్గర వంటింట్లో కూర్చుని ఆకబురూ ఈకబురూ చెప్పి భోజనంచేసే

వాడు పరిభాకరం. కాని ఇవాళ రోజూలాంటిదికాదు. జీవితంలో ఎప్పుడూ ఎరగడు. ములిగిపోతున్న పడవలాంటి అనుభవమేదో అతని గుండెల్లో గుబులుకుంటోంది.

"లేరానాయనా భోజనానికి. అదేంవిరా అలా పడుకున్నావు" పరిభాకరంతో అంది వాళ్ళమ్మ స్తంబానికి ఆనుకుని. "నాన్న వచ్చినతర్వాత తింటాలేవే" అన్నాడు పరిభాకరం. తల్లి తన ముఖంచూడకుండా పక్కకు తిప్పుకున్నాడు.

లేకలేక పుట్టిన పరిబాకరం ఎప్పుడూ ఇలా అనడం ఎరగదాతల్లి. ఏదో వైపరీత్యంలేకపోతే అలా ఎందుకంటాడు? ఆమె గ్రహించింది. తన చిట్టితండ్రికేదో తీవ్రమైన ప్రమాదం సంభవించిందని గ్రహించిందామె. అందుచేతనే మడతమంచం దగ్గరకువచ్చి నుదురుమీద చేయివేస్తూ ఇలాఅంది:

"అదేంవిరా నాయనా, ఈవేళ అలాగంటున్నావేం? బాబూ, భోంచేసి పడుకుందువుగానిలే. మీనాన్న ఊరికెళ్ళారు రాత్రికిగాని రారు" అంది తల్లి. పరిబాకరం ముఖం ఎర్రగా కందగడ్డలా కందిపోవడం గ్రహించింది. కారణం మాత్రం గ్రహించలేకపోయిందామె.

మధ్యలో తెగిపోయే బరువైన కావడిలా కదులుతూ లేచాడు పరిభాకరం. మెల్లగా తల్లి వెనకాలే వెళ్ళాడు. కోడి కెక్కిరించినట్లు, రెండో మూడో మెతుకులు నాలిక్కి రాసు

కున్నాడు. భోజనంచేస్తున్న ఆ రెండు నిమిషాల్లోనూ నాలు గైదుమార్లు రంగయ్య మాష్టర్ని తల్చుకున్నాడు.

ఒకసారి ఆకాశంలోకి ఇబ్బందిగా చూస్తూ, ''నాకింక చదువెవరు చెబుతారే అమ్మా'' అన్నాడు.

ఇంకోసారి "మాష్టారేం తప్పుచేశారని వాళ్ళు తీసుకు పోయారే'' అన్నాడు సమాధానంకోసం ఆశించకుండానే. ఇంటి నడికప్పుమీంచి నల్లగా మసిబారి వేలాడుతున్న బూజుల్ని యథాలాపంగా చూశాడు.

కొడుకు వింతప్రవృత్తి అతిజాగ్రత్తగా గమనిస్తోంది తల్లి. ఏదో బాధ ఆమెలో ఘనీభవించుతోంది.

వంటింట్లో పొయ్యిప్రక్కనే ఉన్న 'మాలక్ష్మిగూడు' దగ్గరకు వెళ్ళింది. 'తల్లీ నాకొడుక్కు ఏ ఆపదా రాకుండా కాపాడమ్మా, నీవే ఇచ్చావ్, నీవే పాలించాలి తల్లీ!'' అని ప్రార్థించుకుంది.

ప్రభాకరానికి కాస్త పక్కలు వెచ్చగాఉన్నా, ఏ ఆట లోనో పడిపోతే, ఏ మొక్కమీదో కాస్త దెబ్బతగిలినా ఇలా ప్రార్థనచేసుకోవడమామె కలవాటు.

భోజనంచేసి వెళ్ళి మళ్ళీ పడుకున్నాడు.

తల్లి భోజనంచేసి, చెంబులు తప్పేలాలు సర్దుకునివచ్చే సరికి, బాగా నిద్రపోతున్నాడు ప్రభాకరం.

ఆ పొద్దెలా గడిచిపోయిందో పాపం ఆ తల్లికే తెలియదు!

ఆయన యింటికి వచ్చేసరికి రాత్రి చాలా పొద్దు పోయింది. ఈలోగా తల్లి రెండుమూడుసార్లు లేపింది కాని, ప్రభాకరానికి మెలుకువ రాలేదు.

"ప్రభాకరం! లే నాయనా" అన్నారాయన వంటి మీద చేయివేస్తూ. ఒళ్ళు కుతకుతలాడుతూ, చేయేస్తే అంటుకుపోతోంది.

"బాగా జ్వరంవచ్చిందే" అన్నారాయన;

ప్రభాకరం ప్రక్కకు ఒత్తిగిలుతూ, "ఆ రాక్షసులు మా మాస్టార్ని ఎందుకు తీసుకుపోయారు?" గట్టిగా అరిచాడు. ఈవాక్యాల్ని ఎంత స్పష్టంగాఅన్నా, శరీరంమీద తెలివిలేదు.

తండ్రికి కొడుకుస్థితి బోధపడింది. కాని ఏంచేయాలో తోచుబడి కాలేదు.

క్షణం గడిచిపోయింది నిర్లక్ష్యంగా.

"నాకింక చదువెవరు చెబుతారు బాబోయ్!" మళ్ళీ పెద్దగా పలవరించాడు.

ప్రభాకరం శరీరంమీద వడ్లు పేలాలవుతున్నాయి.

కర్తవ్యంకోసం చాలా సేపాలోచించాడు తండ్రిగారు. ఆఖరికి ఏదో ఉపాయం తోచిందిలావుంది.

ప్రభాకరాన్ని చేతితో తాకుతూ యిలా అన్నారు– "లే నాయనా, నేను వాళ్ళనడిగే వచ్చాను. రేపు తీసుకువచ్చి ఇక్కడ దిగబెడతామన్నారు..." అన్నారాయన.

ఆ మాటలెలా వినిపించాయో తెలియదు, కాని విని పించాయి. ప్రభాకరం మగతగా మేలుకున్నాడు.

గభీలున లేచి కూర్చున్నాడు.

"నిజమేనా— నాన్నా! నిజమే?" హడావుడిగా ప్రశ్నించాడు.

"నిజం బాబూ, లే, కాస్త కాఫీ తాగుదువుగాని..." అన్నారు నాన్నగారు.

తెల్లవారేవరకూ, అలాగే మెలకువగా కూర్చునే ఉన్నాడు ప్రభాకరం...

ఎదురు తెన్నులు చూస్తున్నాడు;

ఆ రేపు వస్తుందని...

★